

కథా కౌముది

# రాజనాల బండ

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

"మేక సస్తే – నాకు లాబం
నేను సస్తే – నీకు లాబం"

అంటా సాటవనే పాటమాదిర్తో పాడుకుంటా సంబరంగా ఎగుర్లాడుకుంటా వస్తాండాడు ఒక పిల్లకాయ. ఆ పాట వింటానే పెద్దప్పకు రగిలిపోయింది. దానికే వాన్ని ఆడనే అడ్డగిచ్చుకుని, "నువ్వు సస్తే నాకేందిరా లాబం? గూబ నాయాలా" అంటా వాని మెడకి పట్టి బిర్రుగా ఒక్కటి అంటుకున్నాడు పెద్దప్ప. ఆ ఏటుకి వాని సంబరం గాలికిపాయె–వాడు పోయి నేలక్కరుసుకుండె.

"సావంట సావు. ఎవుడు ఎట్ల సస్తే నాకేమిరా పరిగల నాయాలా?" అంటా వదురుకుంటా ముందుకు ఎలబారినాడు పెద్దప్ప. ఆయప్పకు అంత కోపం వచ్చిండేదీ, ఇట్లా అడ్డంపట్టి అందరిముంగటా పిల్లోనితో రంపుకు పోయిండేదీ ఎవురూ సూడలా. అయినా ఆ సాటవని ఇంటానే కుల్లుకునేదానికి పెద్దప్పేమీ పంచాంగం సామీ కాదు – గొర్రెలకాడి గొల్లా కాదు.

అట్లైతే దేనికబ్బా పెద్దప్ప అంతగా రేగిపోయిండేది?

దేనికంటే..,

ఆ పక్క చూస్తే ఎమ్మెల్యే సీటు అడక్కుండానే వచ్చింది. ఈ పక్క చూస్తే ఎబ్బుడో జరిగిండే మర్డర్ కేసు మల్లా పానంపోసుకుని ఊరంతా తారాడుకోనొచ్చి పెద్దప్ప తలకు సుట్టుకునింది. ఈ పెద్దప్ప ఉండూరు సర్పంచికాడ్నించీ మండలాధ్యక్షునిదంకా అంత ఉలకంగా ఎగబడినాడా? ఇట్లా మర్డర్ కేసులే కదా సన్నోల్లను పెద్దోల్లుగా చేసేటియి! ఈ మర్డర్ చేపిచ్చిండేది ఆయనేమీ కాదు. కానీ తప్పించిండేది మాత్రం పెద్దప్పే. ఇట్లా తప్పుడు పన్లు చేసినోల్లను కాపాడేది చాలించమని ఎవురు ఎన్నితూర్లు ఎంతగా చెప్పినా ఆయప్ప ఇంటేకదా? లోగా ఉండేటోన్ని, నా మాటే ఇన్లా. ఇంక కన్నోళ్ళమాటలేం ఇంటాడుగానీ ముందా కేసు కథ చెబుతా ఇను!

మన పెద్దప్ప పెదనాయనగారి కూతురు లచ్చిందేవిని చూసినావా? బో కచ్చి నాశినంలే! పట్టిందంటే ఒగిటే పట్టు. పగిలేదంకా ఇడిచిపెట్టేది లేదు. అట్లా లచ్చిందేవి మొగుడు సారాయి రెడ్డెప్ప. ఆయప్ప పెండ్లానికి పదింతలలు కచ్చినాయాలు. దానికే సారాయితో ఎగబడొచ్చినాడు. "మనట్లా మర్యాదస్తులకు సారాయి యాపారం ఒంటదు. నువ్వైనా ఆ రెడ్డెప్పకు యాపారం చాలించెయ్యమని చెప్పరాదా?" అంటా పెద్దప్పను ఎన్నోతూర్లు అడిగినా. ఐనా ఆయప్ప చెవికేసుకోలా. ఇట్లాంటోల్లను చూసే, "మంచి ఇన్నా-మంచి చేసినా ఆ మనిషి పెద్దమనిషే కాదు" అనే సాటవ పుట్టింది.

ఒకతూరి సారాయి పాటలకాడ రెడ్డెప్పకూ ఎంగట్రెడ్డికీ గలాట పడినాది. ఏ ఇద్దరైనా గలాట పడాల్నేగానీ తంటలు ఎగేసేదానికి ఊరంతా అయినోల్లే. దానికే ఆ గలాట ఒగర్ని చూస్తే ఒగరికి కాకుండా చేసినాది. కడపటికి ఒకళ్ళమింద ఇంకొకళ్ళు దొమ్మీకేసులు పెట్టుకునేదాకా ఎగబడింది.

దొమ్మీ కేసుల సమాచారం ఈ రెడ్డెప్పా ఆ ఎంగట్రెడ్డీ చెబితేగానీ మన కోర్టులకు తెలవదా? దానికే ఆదనింటీ ఈడకీ – ఈడనింటీ ఆడకీ వాయిదాలు ఏస్తానే ఉంటాయి. యాడికి వాయిదా ఏస్తే ఆడికి సాక్ష్యం చెప్పేటోల్లందర్నీ ఏగిచ్చుకుని పోయేది చానా పెద్ద పని. అయినా గొమ్ముమనుండరు. వాయిదా వాయిదాకూ ఒకటో రెండో కొత్త కేసులు పెట్టుకుంటానే ఉంటారు. ఇట్లా కేసులు పెట్టుకునీ పెట్టుకునీ ఉన్న చేన్లూ మడికయ్యలూ అమ్ముకున్నా కేసుమాత్రం తీర్మానం కాదు. దాంతో వాండ్లే యాష్టకొచ్చి మన పెద్దప్పట్లా పెద్దమనుషులకాడికొచ్చి రాజీ చేసుకుంటారు. దానికే కదా, కోర్టులు వాయిదాలు ఏసేది?

ఒకతూరి తిరప్తి వాయిదాకి పోయి వస్తాండారు. గెనుంమింద కనపడిచ్చినాడు రెడ్డెప్ప. మన ఎంగట్రెడ్డి మనుసులకు ఆ గెనుం మింద పోవాల్సిండే పనేమీ లేదు. అయినా ఎదురుపోయి అడ్డగిచ్చుకున్నారు. మాటకు మాట కలేస్తా ఆయప్పకు రేగబెట్టినారు. ఆయప్పకు కోపం వచ్చి రెండేట్లు ఏసేదంకా గొమ్మునుండారు. ఆయప్ప కొడతాన్నిట్టే– "కొట్టినాడు"అనే సొట్టు పెట్టి రెడ్డెప్పమింద తిరగబడినారు. అంతలోకే ఒకాయప్ప భుజానుండే కాడిమాను ఎత్తుకుని రెడ్డెప్ప మెడకుపట్టి బిర్రుగా ఒక్కేటు ఏసినాడు. ఆ ఏటును తట్టుకుండేది కాక రెడ్డెప్ప పానాలు నీగేసినాడు.

ఎంగట్రెడ్డి మన పెద్దప్పకు జిగ్రీదోస్తులే. దానికే ఆయప్ప నేరుగా పెద్దప్పకాడికి వచ్చినాడు. ఆయప్పను మాట్లాడించేదానికి తాళువారంలోకి వస్తాండే పెద్దప్పకు"పుగసోటోల్లకోసం బంధుత్వాల్ను పోదోసుకునేది మంచిది కాదు. ఆయప్పకు మంచిమాటలు చెప్పి అంపిచ్చెయ్యి"అంటా బంగపోయినా. కానీ పెద్దప్ప మతించలా.

ఎంగట్రెడ్డికాడికి పోయి ఆయప్ప బుజంమింద చెయ్యేసి"మర్దర్ కేసునించీ తప్పించేదానికి ఏం కావాలన్నా చేస్తా, నువ్వేం బయపడగాకు" అనే మాట చెప్పేసినాడు. ఇట్లా పంగమాలిన మాటలు నిలబెట్టుకునేదాంట్లో మన పెద్దప్పను మించినోడే లేదు. ఆపొద్దు మాట నిలబెట్టుకునిందానికే ఈపొద్దు పార్టీలో మన పెద్దప్పకు సపోర్టు చేసి రుడం తీర్చుకుండాడు ఎంగట్రెడ్డి.

ఇదంతా చూసి లచ్చిందేవికి కడుపే కాలిపాయె. కానోల్లకోసం అయినోల్ల కడుపు రగిలిచ్చిండే పెద్దప్పను ఓడించేదానికి తీర్మానం చేసుకుంది లచ్చిందేవి. దానికే ఈపొద్దు పెద్దప్ప ఎమ్మెల్యే సీటు మిందికి ఎగబడి వచ్చినాది.

"ఆ పంగమాలిన కేసు గెలిపిచ్చి పెద్దమనిసై ఎమ్మెల్యే సీటు తెప్పించుకుంటే నిజం–నిజంకాకుండా పోతుందా? మోసగాడు మొనగాడైపోతాడా? వగుంటే మన రాజనాల బండకాడికొచ్చి ఆంజనేయస్వామి ముంగడ నిలబడుకొని ఆ స్వామి ఎదురుంగా "ఈ హత్యకూ నాకూ ఏ సంబందం లేదు" అనే మాట చెబితే పెద్దప్ప ఏ తప్పూ సెయ్యలేదని నమ్ముతా"అంటూ సవాలు చేసి పైపోటీకి నిలబడుకునింది.

లచ్చిందేవి ఎంతెత్తు బండమింద నిలబడుకున్నా.., ఆయమ్మకు ఎంత పెద్ద పార్టీ టిక్కెట్టిచ్చినా పెద్దప్పమింద గెలుచుకుండేది ఉత్తమాటే. ఈ మాట ఆయమ్మకు కూడా తెలుసు. అయినా నిలబడుకునింది. దేనికి? పెద్దప్ప మానం తీసేదానికి!

పెద్దప్ప బయంకూడా ఆయమ్మ గెలుస్తాదని కాదు. ఆయమ్మగానీ నిలబడుకుంటే కులం ఓట్లన్నీ అర్ధానికి అర్థం ఆయమ్మకే పడతాయి. పెద్దప్పను ఓడించేదానికి ఆ అర్థం ఓట్లే చాలు. అదే ఆయమ్మ ధైర్నం. ఆయమ్మ ధైర్నమే ఈయప్ప బయం. పిల్లీ పిల్లీ కొట్లాడుకుంటే కోతి గెలుచుకుంటాది. అయినోల్ల రొట్టె పుగసాటోల్లకి పోతాది. పెద్దోల్లు ఏం చెప్పినారు? ఇంటగెలిచి రచ్చ గెలవమని చెప్పినారు. దానికే, ఇంటగెలిచేదానికోసం రాజనాలబండకు ఎలబారినాడు. అట్లా మంచిపని కోసం బయటొచ్చినప్పుడు సెగినం ఇట్లా సక్రంగా కాకుంటే ఎట్లా?

పాపం, ఆ పిల్లనాయాలికి ఇదంతా తెలవక యాడనో ఇనిండే సాటవను వదురుకుంటా ఎదురొచ్చినాడు. వాడు తెల్లవార్తానే ఎవురి ముకం చూసినాడో పెద్దప్ప సేతిలో పెసాదం తినేసి ఏడ్చుకుంటా పోతాంటే పెద్దప్పకే బాదనిపిచ్చింది. దానికే వాన్ని పిలవనంపి మనవని కోసం ఎత్తి పెట్టిండే అమిరికా గుండు చాక్లెట్టూ, ఇంగ్లాండు పలక బిస్కట్ ప్యాకూ, దుబాయ్ జ్యూసు తిత్తీ ఇచ్చి అంపిచ్చినాడు.

అదృష్టం అంటే వానిదేబ్బా. తినింది ఒక్కేటయినా మూడు లాబాలు సంపాదిచ్చుకున్నాడు. దానికే సంబరంగా పెద్దప్పకు మొక్కి ఏడుపు మాట మర్చిపోయి ఎగుర్లాడుకుంటా ఎలబారిపోయినాడు. మన సిద్దప్ప పిల్లోనికెల్లా మురిపెంగా చూస్తా, "నక్కముగం చూసొచ్చినాడు పిల్లనాయాలు"అన్నాడు. అంతేకాదు,"ఇదే మాదిరి మన లచ్చిందేవక్క మనసుకూడా గెలుసుకుండేస్తావులే పాన్నా. నీకూ మర్దరుకూ ఏ సంబంధం లేదు. ఇంక బయం దేనికి? రాజనాల బండకాడ కూడా గెలుపు నీదే" అంటా నగినాడు.

అయినా పెద్దప్పకు ఏదో అనుమానం. ఏదో బయం. దేనికో అదురు.

పెద్దప్ప ఇంకా అదర్తానే ఉండేది గమనిచ్చుకుని,"ఒక్కతూరి బండమింద నిలబడుకోని నిజం చెప్పేస్తే అర్జునుడి జెండామింది అంజన్నసామి నీ జెండామిందికొచ్చి నిన్ను గెలిపించేదంకా నిద్రపోడు. ఇంకా బయం దేనికి పెద్దప్పా" అంటా ధైర్నం ఎగేసినాడు.

ఇంకా బయపడతా కూసుంటే "పెద్దప్ప" అనే పేరుకే అవమానం. దానికే పెద్దప్ప ఓ మోపున నవ్వుతా, "బయపడేదానికి నేనేమైనా ఆపద్దం చెప్తాండానా?"అన్నాడు.

అంత బయంలేని పెద్దమనిసి దేనికప్పా ఆమాదిర్తో అదర్తాండేది? అనేమాట ఎవురూ అడగలా. నేను అడిగినా ఆయప్ప మతించేది లేదు. దానికే గమ్మునుండిపోయినా!

ఎవురికీ అడిగే ధైర్నం లేదని అదిరే గుండెకాయ అదిరే పని చాలిస్తాదా?

దానిపాటికి అది అదర్తానే ఉంది. దాని అదురుక్కారణం రాజనాలబండ!

నువ్వెప్పుడైనా రాజనాలబండకు పోయినావా? అంజన్న సామిని చూసినావా? ఆ సామి ముంగడ పెమానం చేసినావా? లేదు! నీకు మా అంజన్నసామి సత్తెం తెలవదు. దానికే నీకు బయం లేదు. కానీ పెద్దప్పకు తెలుసు. దానికే బయం!! ఆ బయం దేనికో తెలవాలంటే ముందు నీకా రాజనాలబండ కత తెలవాల.

ఈ రాజనాల బండ.., బూమి పుట్టినప్పుడు పుట్టిండే దేవర బండ. ఎర్రిమనుసులుండే సత్తెకాలంలో దీన్ని "రాజనామాలబండ" అనేటోల్లు. ఊర్లో ఎవురి మాట నడిస్తే వాడే రాజు. అట్లా మాట నడిపించుకున్నోల్లందరి పేర్లూ దానిమింద రాస్తా ఉండేటోల్లు. అట్లా సచ్చినోల్ల పేర్లన్నీ రాసీ రాసీ బండంతా జాగా లేకుండా పేర్లతో నిండిపోయినాది.

అంతలోకే సత్తెకాలం పోయి రామన్నకాలం.., అదిపోయి కిట్టన్న కాలం.., అదికూడా పోయి ఈ కలికాలం వచ్చేసినాయి. కాలాలు ఎన్ని మారినా ఎట్లా మారినా.., మనుసులు మంచిని ఎంతగా ఏమారినా అంజన్నసామిలో రామబక్తి మాత్రం మారేది లేదు. రాముని పేరే ఆయనకు మంత్రం! తంత్రం! యంత్రం.! మిగిలిండేదంతా నడమంత్రం!!!

మన అంజన్నసామి చిరంజీవి కదా, దానికే ఈ కలికాలంలో కూడా ఇంకా రామనామం జపించుకుంటానే తిరుగులాడతాంటాడు. అట్లా తిరుగులాడతా తిరుగులాడతా ఒకతూరి అంజనాద్రికి ఎలబారినాడు.

అంజనాద్రి అంటే అంజన్నస్వామిని కన్న అంజనమ్మ పుట్టిల్లు. అది తిరప్తి కొండల్లో ఉంటాది. ఈ పక్క కర్ణాటకమోల్లూ తమిలనాడోల్లూ ఆపక్క మగారాష్ట్రమోల్లూ తిరప్తికి పోవాలంటే ఈ రాజనామాలబండ దావలోనే పోవాల. దానికే అంజన్నసామి కూడా ఈ దావనే వస్తాండాడు. దావలో పోతావుండేటోల్లు రాజనామాల బండ గురించి చెప్పుకుంటావుంటే ఆ మాట మన అంజన్నస్వామి చెవిలో పడింది.

అంజన్న సామికి తెలిసిందేదొక్కటే,

రాజంటే – రాజారాముడు ఒక్కడే! తల్లంటే – సీతమ్మ తల్లొక్కటే! దానికే రామకోటి రాసిన ఆ బండ ఎట్లుంటాదో సూద్దామని పోయినాడు. ఆడ చూస్తే నూటపదార్లు పంగమాలినోల్ల నామాలుండాయిగానీ రాజారాముని పేరు మాత్రం కనపడరాలా. దాంతో అంజన్నసామికి బేజారైనాది. ఆ పాట్నే ఆ బండమింద చేత్తో తుడిపినాడు. ఆ సామి తుడుస్తాన్నిట్లే రాజులందరి పేర్లూ మాయం అయిపాయె. ఇబ్బుడు, ఆ బండమింద కడామొదలూ యాడ పట్టినా రామనామాలే. అంజన్నసామే స్వయంగా రామకోటి రాసిన రాజనామాల బండ అది.

కాలం ముందుకు పోతా పోతా రాజనామాల బండ పేరే కాదు, దాని మాన–మర్యాదల్నీ చరిత్రనీ కూడా తోడుకొని పోయింది. అంత చేసినా ఆ బండని తోడుకొని పోయేది మాత్రం దాన్నింటీ కాలా.

తరవాత ఎన్నోఏండ్లకు ఒక ఆచారప్ప ఆ పక్కకి పోయినాడు. ఆ రాజనామాల బండ మిందుండే రామనామాల్ని చూసి సంబర పడినాడు. ఆ బండమింద రామన్నస్వామి శిలను తీర్చాలనుకున్నాడు. మంచి దినం చూసుకుని సుత్తికీ ఉలికీ పూజలు చేపిచ్చినాడు. ఆ ఉలి తెచ్చి తగిలిస్తాన్నిట్లే బండమింద రామనామాలన్నీ మాయం అయిపోయినాయి. ఆ బండ మామూలు బండ మాదిరైపోయింది. దాంతో ఆ ఆచారప్పకు బక్తిజాగాలో బయం పుట్టుకునేసింది. దానికే ఆ బండపాటికి బండని ఇడిచిపెట్టేసినాడు. బండకు ఆ పక్క నిలబడుకోనుండే ఇంగో బండమింద రామన్నస్వామిశిలను చెక్కే పని మొదలెత్తుకున్నాడు.

ఆచారప్ప తీర్చిండేది రామన్నసామినే. కానీ తీరిండేది మాత్రం అంజన్నసామి శిల. దాన్ని చూస్తాన్నిట్టే ఆయప్పకి ఇచిత్రం అనిపిచ్చింది. ఆ ఇచిత్రం దేనికి జరిగిందో దిక్కు తెలవక ఆడనే తిక్కలోని మాదిర్తో తిరిగినన్ని దినాలు తిరిగినాడు. అట్లా తిరిగీ తిరిగీ యాష్టకొచ్చి ఆ అంజన్నసామి ఎదురుంగా ఉండే రాజనామాల బండమింద చక్కాలుముక్కాలేసుకుని స్వామి ధ్యానంలోకి ఎలబారిపోయినాడు.

ఆచారప్ప ధ్యానం చేసే మాట ఎవురో గొడ్లకాడి పిల్లకాయలు చూసి పెద్దోల్లకు చెప్పినారు. ఆ పెద్దోల్లు ఆచారప్పని చూసి మొక్కుకునేదానికి వచ్చే పని మొదలెత్తుకున్నారు.

ఆ బండకాడికొచ్చి ఎవురు మాట్లాడిచ్చినా వాండ్లకు "సత్యం వద" అంటా ఇనిపిస్తా ఉండింది. ఎవురు ఎన్ని సెలవులు కోరినా ఒకటే సమాధానం...

"సత్యం వద! సత్యం వద!! సత్యం వద!!!"

ఆ మాటలు ఇనేదానికే జనాలంతా ఆడికి పోయేటోళ్ళు. జనాలు ఆచారప్పను తారాడుకుంటా వచ్చే బండ అనేసి దాన్ని కొత్తగా "జనాలబండ" అని పిలిచే పని పట్టినారు.

ఆచారప్పకు ఆకలి లేదు. దప్పి కాదు. ఒకటీ రొండూ లేవు. దేనికంటే ఆయప్ప ధ్యానం చేసీ చేసీ దేవరైపోయినాడు. కానీ ఆయప్పని చూసేదానికి వచ్చేటోళ్ళు దేవర్లు కాదు. మామూలు ఎర్రిగొర్లు. వాండ్లకు ఆకలైతింది. దప్పైతింది. నడిచీ నడిచీ కాల్లూ నడుములూ నొప్పెత్తుకుంటాయి. అట్లావాండ్లకు తిండి సౌకర్యం చెయ్యాలని ఆచారప్ప మనసులోకి వచ్చింది. ఆ పాట్నే ఆయన ముందు బియ్యం ఉడ్డతోసి కనపడిచ్చినాయి. ఆ బియ్యాలు కూడా అట్లా ఇట్లా బియ్యాలు కాదు. లోకంలో యాడా లేని సత్తవుండే ఎర్రబియ్యాలు. ఎంతమందైనా పోనీ, అంతమందికీ సరిపోయే బియ్యాలు ఆడ కుప్పతోసి ఉంటాయి.

బియ్యాల్ను మన తెలుగోల్లు రాజనాలు అంటార్లే. ఆచారప్పను చూసేదానికీ, అంజన్నస్వామికి మొక్కేదానికీ వచ్చే బక్తులందరికీ అన్నప్రసాదం పెడతాండాదా బండ. దానికే ఆ జనాల బండను – మన జనాలంతా చేరి "రాజనాలబండ" అని పిలిచేది మొదలెత్తుకున్నారు.

కాలం–కాలం అయిపోతా పోతా ఆచారప్పను అంజన్నస్వామిలోనూ–రాజనాలను భూదేవిలోనూ కలిపేసి పోయినాది. కానీ ఆ బండమాత్రం అట్లాగే ఉండాది.

మన పుంగనూరు కోటలో ఒక పెద్దజవాను ఉండేటోడు. ఆయప్పకు ఒకాయమ్మి మింద మర్లు పుట్టినాది. దానికే ఆయమ్మను పెండ్లి చేసుకోమని అడిగినాడు. ఆయమ్మి ఒప్పుకోలా. దాంతో ఆయమ్మి అమ్మానాయన్లను పిలవనంపినాడు. "రాజుకు కట్టాల్సిండే నూట పదారు కాసుల పన్ను ఉన్నపాట్నే కట్టినా సరే – లేకుంటే నీ కూతుర్ను అంపినా సరే" అన్నాడు.

ఆయమ్మి నాయనగారు,"రాజుకు కట్టాల్సిండే పన్ను ఎబ్బుడో కట్టేసినా దేవరా! నా కూతుర్ను ఇడిచిపెట్టు" అంటా అడుక్కున్నాడు. అయినా జవానుగోడు తలకేసుకోలా. అంతలోకే ఆయమ్మి వచ్చినాది. నేరుగా పోయి జవాను ముందు నిలబడుకునింది. "మా నాయన పన్ను కట్టాల్సిండేమాట నిజమే అయితే ఆ మాట ఈ బండమింద నిలబడుకుని చెప్పు" అనింది. ఆయమ్మకు రాజనాల బండ సత్తెం గురించి తెలవదు. ఐనా సరే ఆ పుంగనూరు జెవానుగోన్ని బయపడిచ్చేదానికి అట్లా సవాలు చేసింది.

రాజనాల బండ సత్తెం గురించి తెలవని ఆ పెద్ద జవానుగాడు."అదేం పెద్దపనా?" అంటా పోయి బండమింద నిలబడుకున్నాడు. "నేను చెప్పింది అపద్ధమైతే నా తలకాయ అంజన్నస్వామి ముందు టెంకాయమాదిర్తో వొక్కలైపోవాల" అన్నాడు. ఆపాట్నే ఆయప్ప తలకాయ పిచ్చలు పిచ్చలైపోయింది.

జవానుగోడి సావు చూసిన జనాలకు చూస్తాండేది నిజమో కలో అర్థం కాలేదు. కానీ ఎదురుంగా పొగురుపట్టిండే పెద్ద జవానుగోడు తలపగిలి నేలబడి నీలుక్కునిందీ.., కండ్లముందే పానాలు నీగేసిందీ కనిపిస్తానే ఉంది.

దానికే ఆడుండే జనాల్లోకి బండంటే బయం–అంజన్నసామంటే బక్తీ ఎగబడొచ్చినాయి. ఆ పొద్దుటినించీ ఈ పొద్దుటిదంకా ఆ బండ కాడికి పోయి ఆబద్ధం చెప్పే దైర్నం ఎవురికీ లేదు.

ఆ నడుమ దేశచరిత్రలు రాసేటోల్లు వచ్చినారులే. వాండ్లు రాజనాల బండ సత్తెం మాట తెలుసుకున్నారు. ఆ బండకాడ ఎవురికీ అన్యాయం జరగదనీ.., అన్యాయం చేసినోడు బతకడనీ.., దానికే ఆ బండకి "రాజన్యాయాల" బండ అనే పేరొచ్చినాదనీ, ఆ పేరే జానపదుల నోటిలో పడి రాజనాలబండగా మారిందనీ రాసుకుని పోయినారు. ఈ చరిత్రోల్లింతే, ఉన్నదానికీ – లేనిదానికీ వాండ్ల అష్టతెలువులూ కలేసి అడ్డంపట్టి యోచన చేస్తారు. కడపటికి లేనిది ఉండేట్టుగానూ ఉండేది లేనట్టుగానూ రాసుకుని పోతారు. లేకుంటే "రాజన్యాయాల బండ" అనేది రాజుగారి కోటకు ముందో – రాజ్యానికి నడిమద్దెనో ఉంటాదిగానీ, వాండ్ల రాజ్యం దాటుకునొచ్చి ఇట్లా అడివిలో ఏంటికప్పా ఉంటాది?

ఎవుర్తో ఉండానో వాండ్లకే ఏమీ చెప్పలేనోడిని. నాకేంటికిలేప్పా ఆ చరిత్రోల్ల తంట!!

అదో.., అట్లాంటి రాజనాల బండకాడ నిజం చెప్పేదానికి పోతాండాడు పెద్దప్ప. ఆడికి పోయేటోనికి తప్పు చేసినా చెయ్యకున్నా గిలిగానే ఉంటాది. దానికే పెద్దప్ప అదర్తాండాడు. అయినా ఆ అదురు కనపడరాకుండా సిగరెట్టు పొగతో అదంబట్టుకుని కూసోనుండాడు. కారు పడీలేచీ ఎగిరీ దుంకీ రాజనాలబండకాడికి చేరినాది.

అప్పటికే మన పెద్దప్పకు అయినోల్లంతా కార్లూ బండ్లూ ఏస్కోని వచ్చేసినారు. పెద్దప్ప కోసం కాసుకోనుండారు.

వాండ్లను చూస్తానే నాకు సంగతి అర్థమైపాయె. దానికే పెద్దప్పను ఎచ్చరిస్తి,"యోచన చెయ్యి పెద్దప్పా యోచన చెయ్యి. ఇట్లాంటితావుకు వచ్చేముందే యోచన చెయ్యాల. కానీ కన్నోల్ల మాటలు ఇనుకొని ఇంతదూరం ఎలబారి వచ్చేసినావు. ఇబ్బుడైనా యోచన చెయ్యి. లేకుంటే యోచన చేసేదానికి తలే ఉండదు" అంటా ఉండేమాట చెప్పినా. కానీ పెద్దప్ప తలకేసుకోలా. అయినా లోపట గిలిగానే ఉండాది. దానికే ఆయప్పకు కారుదిగేదానికి కాళ్ళు రాలా. లెగిచేదానికి మనసు రాలా.

కానీ గెలవాలంటే కారు దిగి రాక తప్పదు.

పెద్దప్ప దిగాల్నా వద్దా అనేది తీర్మానించుకుండే లోపటే జనాలు "పెద్దప్పకీ జై! ధర్మానికీ జై! ధర్మరాజుకీ జై!" అంటా జైకొట్టే పని మొదలెత్తుకున్నారు. జైకొట్టాల్సింది నిజం చెప్పించే అంజన్నస్వామికా? నిజం చెప్పేదానికి అదిరి సస్తాండే పెద్దప్పకా? ఈ జనాలు ఇబ్బుడే కాదు ఎబ్బుడూ యోచనచెయ్యలా. దానికే మన పెద్దోల్లు "జనందాటూ గొర్రెదాటూ ఒగిటే" అని చెప్పిండేది. జనాలంతా అంత బ్రెమగా జైకొడతాండారు. ఇబ్బుడుగానీ దిగకుంటే మానమర్యాదలు మంట్లో కలిసిపోతాయి. దిగితే పానాలు గాల్లో కలిసిపోతాయి. ఎట్లా?

పెద్దప్ప ఎనకముందులాడతాండేది సిద్దప్ప గమనించినాడు. దానికే ఈ పక్కనుండి కారు దిగి పూలహారం ఎత్తుకున్నాడు. ఆ పక్కనుండే పెద్దప్ప ముందుకు పోయి ఆయప్ప మెడలో హారం ఏసినాడు. అంతే.., జనాలంతా సంబరంగా సప్పట్లు తట్టేసినారు. మెడలో పూలహారం పడతానే పెద్దప్పకు ధైర్నం ఎగబడొచ్చినాది. దానికే, "ఎట్టైతే అట్లాకానీలేబ్బా" అనేకాడికొచ్చినాడు.

జనాలకు చేతులెత్తి మొక్కతా కిందకు దిగినాడు పెద్దప్ప. ఆయప్పకు ఎదురొచ్చినాడు గుడి పూజారప్ప.

రాజనాలబండ పూజారప్పంటే బగమంతుడికీ బత్తుడికీ నడుమ రాజీ చేపిచ్చే పెద్దమనిసి. న్యాయంకోసం వచ్చేటోల్లను ముందుగా మాట్లాడిచ్చేది పూజారప్పే. బండకాడికి పోకుండానే మద్దెస్తాలు తీర్చేదానికి చూస్తాంటాడు. మన పెద్దప్పను కూడా నేరుగా గుడి ముందుకు కాకుండా, గుడి ఎనకుండే రచ్చల రాగిమానుకిందికి తోడుకొనిపోయినాడు.

బండమింద కుసుండబెట్టి మర్యాదగా"సూడు పెద్దప్పా, రాజకీయాల్లో ఇయ్యన్నీ మామూలే. చేపిచ్చిండేది నువ్వు కాకుంటే రాజనాల బండెక్కు. లేకుంటే మూర్తం దాటిపొయ్యిందనే సొట్టు చెప్పి నేనే తప్పిస్తా. ఒక్కతూరిగానీ బండెక్కినావంటే నిజం ఏందో నువ్వు చెప్పే పనిలేదు. ఆ బండే చెప్పిస్తాది. నేను చెప్పాల్సిండేది చెప్పినా. ఇంగ నువ్వెట్ల చెయ్యమంటే అట్లా చేస్తా" అంటా పెద్దప్పనే అడిగినాడు.

ఆ మాట అడుగుతానే పెద్దప్పకు ఇంగా రోంత ధైర్నం ఎగబడింది. ఆయప్ప మామూలోడు కాదు. ముందే లా సదిగినోడు. ఆయప్పకు తెలవని న్యాయాలా? కానీ ఆయప్ప సదివిండే న్యాయాలు వేరు. ఈ బండమింది న్యాయాలు వేరు. దానికే ఒకమాట అడిగినాడు, "మన చట్టాలూ న్యాయాలూ ఈడ పని చేస్తాయా?"

"పని చేస్తే ఇంతదూరం ఏంటికొస్తారు స్వామీ. వాంట్లికి సాక్ష్యాలు కావాల. దీనికి ఆత్మసాక్షి కావాల. అంజన్నస్వామి ముంగట ఆత్మసాక్షి ఆపద్దం చెప్పదు. చెప్పనియ్యదు. అయినా మొండికి తిరుక్కుని ఆపద్దం చెబితే ఆ మనిసిని బతకనియ్యదు. మన ఆంజన్నసామికి రామునికాలం న్యాయాలే గానీ ఈపొద్దుటి న్యాయాల మాట తెలవదు. మీ చెల్లెమ్మ ఏపిచ్చిండే ప్రశ్నేంది? మర్డర్ చేపిచ్చిండేది నువ్వని. చేపిచ్చిండేది నువ్వు కాకుంటే నీకేమీ కాదు"

"చేపిచ్చిండేది నేను కాదు"అన్నాడు పెద్దప్ప.

"ఆమాట నిజిమైతే అదేమాట బండమింద నిలబడుకుని చెప్పేసి దిగిపో. నీకేమీ కాదు"అంటా నమ్మకంగా చెప్పినాడు పూజారప్ప. ఆయప్ప మాట ఇంటానే పెద్దప్పకు కిందనింటీ పైదంకా ఒళ్ళంతా ధైర్నం వచ్చేసింది. దానికే గత్తుగా లెగిచినాడు. కండువా తలకు చుట్టినాడు. నేరుగా బండకాడికి ఎలబారినాడు. జనాలందరికీ నమస్కారం చేసినాడు. కీపాస్ సరిచేసుకుంటా పోయి బండముందు నిలబడుకున్నాడు. దానికి మొక్కినాడు. దానిమిందికి ఎక్కి నిలబడుకున్నాడు. ఆ పాట్నే "ఆ మర్డర్ చేపిచ్చిండేది నేను కాదు" అంటా పదూర్లకు ఇనపడేంత గట్టిగా చెప్పినాడు. ఆ పాట్నే కిందికి దుంకేసినాడు.

రాజనాలబండమిందెక్కి చెప్పిండేమాటంటే అది నిజిమే! నిజిమే! నిజిమే! నిజం తప్పిస్తే ఇంకేమీ కాదు! దానికే జనాలంతా పెద్దప్పకి జైకొట్టేసినారు. సిద్దప్పైతే పెద్దప్పను బుజాలమిందికి ఎత్తుకునేసినాడు. ఆపాట్నే ఎవరో పదివేల కుక్కటపాసాల సరం ముట్టించినారు. అంతే! ఆడంతా ఒకటే టపటపాల్!!! ఢమఢమాల్!!! కడపటికి ప్రశ్న ఏపిచ్చిండే పెదనాయన కూతురు లచ్చిందేవమ్మ కూడా వచ్చి పెద్దప్పకి మొక్కేసినాది.

ఈ జనాలదంతా బో ఇచ్చిత్రంలేబ్బా. కండ్లతో చూసిందీ చెవుల్తో ఇనిందీ నిజం అనుకుండేస్తారు. కానీ నిజంగా జరిగిండేదే వేరు! ఈ జనాలు అనుకుంటా ఉండేదే వేరు.

సత్తెం వేరు – నిజం వేరు.

సత్తెంగా జరిగిండేదేమంటే.., పెద్దప్ప రాజనాల బండమిందెక్కుతాన్నిట్టే పెద్దప్ప కాలాన్ని నిలేసినాడు అంజన్నసామి. ఆ పాట్నే పెద్దప్పను ఒక్కోమాటా అడిగేపని పట్టినాడు.

ఆ స్వామి అడుగుతాంటే..,

ఈయప్ప బయంతో అదుర్తాంటే..,

నేను నిజం చెప్పేదానికి చూస్తాంటే..,

అబ్బుడు.., అబ్బుడు.., ఆ రాజనాల బండమింద ఏం జరిగినాదంటే..,

అంజన్నసామి పెద్దప్పను చూసినాడు. చూస్తాన్నిట్టే ఆయప్ప బతుకంతా సదివేసినాడు. సదూతాన్నిట్టే ఏం అడగాల్నో అర్థం చేసుకునేసినాడు. ఆపాట్నే అడిగే పని మొదలెత్తుకున్నాడు.

"నువ్వు పెద్దప్ప. మీది ముష్టూరు. మీ జేజినాయన సొసంత్రం రాకముందే చెరువుల్లో పూడు తీయించినాడు. సేద్యానికి బావులు తొగించినాడు. సొసంత్రంకోసం కర్నూలు పోయి సత్యాగ్రహం చేసినాడు. అనంతపురంలో అన్యాయంగా జైలుకు పోయినాడు. కడపలో తెల్లోల్ల గుడ్డలకు అగ్గిపెట్టినాడు. తిరప్తిలో గాందీతో చేరి కొండెక్కినాడు. కడపటికి సొసంత్రం కోసం ఆస్తులన్నీ నీగేసినాడు. దానికే ఆయప్పను జనాలంతా దేవునిమాదిర్తో చూస్తా ఉండినారు. అట్లాంటి పెద్దప్ప పోయి మీ తాతొచ్చినాడు. చేన్లను కూడా అమ్మేసినాడు. మీ నాయనొచ్చినాడు. బూదేవమ్మను బూదేవిపాటికి ఇడిచిపెట్టి యాపారాలు, రాజకీయాలూ మొదలెత్తుకున్నాడు. నువ్వొచ్చినావు. ఈ సీమకు సరిపోని పంటలన్నీ పెట్టిచ్చినావు. విదేశీ మందులన్నీ కొట్టిచ్చినావు. ఆ దేశాల్లో పక్కన పడేసిండే పంగమాలిన రసాయనిక ఎరువులన్నీ తెచ్చి ఈడోల్లకు తగలగట్టినావు. భూదేవి సత్తవంతా వాంట్లి ఎదానపెట్టినావు. నువ్వుమాత్రం దుడ్లు ఎగబెట్టుకుని సావుకారైనావు" అంటాన్నిట్లే నాకు ఒకమాట గెమనం వచ్చింది.

లచ్చిందేవమ్మకి ఏడుమంది అక్కగార్లు. పెద్దాయమ్మ ఆదిలచ్మి. ఆయమ్మే ఈ బూదేవిని ఇచ్చిండేది. చిన్నాయమ్మ ధాన్యలచ్మి–కడుపునింపే అన్నపూర్ణమ్మతల్లి. మూడోది ధైర్నలచ్మి. అది లేకనే కదా, మన పెద్దప్ప ఈ బండకాడికి రమ్మని సవాలు చెయ్యగానే బయపడి సచ్చిండేది! ఇంకా గజలచ్మి బలాన్నీ, సంతానలచ్మి మన పెద్దోల్ల

మంచిని ఎగేసేదానికి బంగారు బిడ్డల్నీ ఇస్తాది. మన పెద్దప్పకి జేజినాయన పేరు పెట్టిండేదే దానిక్కదా. కానీ ఈయప్ప ఇట్లా తీరిపోతాడని అనుకుంటే ఆ పేరే పెట్టేటోల్లు కాదు. అదంతా ఇబ్బుడు దేనిగ్గానీ ఎవురి పని వాండ్లు సక్రంగా చేసినోల్లను గమనిచ్చుకుని దగ్గరుండి గెలిపిస్తాది ఇజయలచ్చుమమ్మ. ఎంత పెద్ద విజయాన్ని సాధించేటోనికైనా ఉండాల్సిండేది చదువు. అదుంటే వచ్చిన విజయాన్ని నిలబెట్టుకుండేది ఎట్లాగో తెలుస్తాది. ఆ సదువునిచ్చేది ఇద్యాలచ్మి. ఈ ఏడుగురు అక్కగార్లనూ సక్రంగా చూసుకున్నోల్లకాడికి ఆ ధనలచ్చుమమ్మే తారాడుకుంటా వస్తాది. అంతేగానీ ఆ ధనలచ్మి నేరుగా ఎవురికాడికీ పోదు. ఈ మాట నేను చెబితేగానీ పెద్దప్పకు తెలవదా? తెల్లవార్తానే అష్టలచ్మీస్తోత్రం సదూకుంటేగానీ ఏ పనీ మొదలెత్తుకోడీ పెద్దప్ప. అట్లాంటి మగానుబావుడు ఏమి చేసినాడు? నేరుగా దనలచ్మికోసం ఏడుగురు అక్కగార్లనూ పక్కనపెట్టేసినాడు. దానికే ఈ పొద్దు ఈ బండమింద నిలబడుకునే గతికొచ్చినాడు.

అక్కగార్లను దొంగలతోలి దుడ్డుమాలచ్మిని ఎగబెట్టుకుండేది తప్పని చెప్పేదానికి నేను నోరు తెరుస్తాన్నిట్టే నా గొంతు అదంబట్టినాడు పెద్దప్ప. నేను తప్పించుకోలేక తనకలాడతానే ఉండా. ఈ మాట తెలవని అంజన్నసామి కండ్లెర్రజేసి పెద్దప్పకెల్లా చూస్తానే ఉన్నాడు. అడగాల్సిండే మాటలు అడగతానే ఉండాడు.

"అయిన సదువులన్నీ సదివి, అయిన తెలువులన్నీ ఉపయోగించి నువ్వు జనాలకు చేసిండే మంచి ఏంది? నీకూ రెడ్డెప్పకూ కాకుండాపోయింది దేనికి? ఆయప్ప ఐనూరడుగుల బోరు ఏపిచ్చినాడు. నీల్లు దండిగా పడినాయి. ఆ బోరు ఏటుకి నీ నన్నూరడుగుల బోరులో నీల్లు కూడా ఆ పక్కకే ఎలబారిపోయినాయి. అది చూసి నువ్వేమి చేసినావు? బోరుబొక్కలేపిచ్చేటోల్లు నన్నూరడుగులకంటే జాస్తి ఏస్తే బూదేవంతా ఎడారైపోతాదని నోరునోరు కొట్టుకున్నావు. ఇంటింటికీ తిరిగి కాల్లూ చేతులూ పట్టుకుని జనాలకు ఎక్కడా లేని నీల్ల కతలన్నీ చెప్పినావు. మంది నోట్లో నానీ నానీ నాలుకైపోయినావు. ముష్టూరు బగీరతుడనే పేరుతెచ్చుకున్నావు. పెద్దప్ప నీ రూపంలో మల్లా వచ్చినాడనిపిచ్చుకున్నావు. ఆ బగీరతుని పేరు చెప్పుకుని హంద్రీనీవా కాలువ కాంట్రాక్టు పనులు తెచ్చుకున్నావు. గుర్రంకొండ కాడినించీ కలకడదంకా కాలువ తొగిచ్చినావు. ఆ కాలువను సూయిచ్చి సర్పంచయినావు. ఇబ్బుడా కాలువ యాడుండాది? ఏ గుంతల్లో పడుండాదో ఏ మంట్లో కలిసుండాదో ఎవురి తెలుసు? తొగిచ్చిండే నీకే తెలవదు. ఇంక జనాలకెట్లా తెలుస్తాదిలే!?

దిగువపల్లెల జనాల్ను మదనపల్లెకు అంపిచ్చినావు. చెరువుగడ్డన సుట్టిండ్లు కట్టిపిచ్చినావు. వాండ్లు ఇంతో అంతో తెలివి తెచ్చుకున్నారు. వాండ్ల తెలివి వాండ్లకు బతుకుదారి సూయిచ్చే ముందే వాండ్లముందు బొరుగులు చల్లి బెల్లాలు పెరుక్కున్నమాదిర్తో జాగాలు అగ్గవగా కొనేసినావు. ఆ జాగాల్లో షాపింగ్ మాల్సు కట్టిపిచ్చినావు. ఆ దుడ్లతో ఎగబడొచ్చి మండలాధ్యక్షుడైనావు. రేపు ఎమ్మెల్యే అవుతావు. మర్నాడు మంత్రవుతావు. ఇంతదంకా మన ముఖ్యమంత్రులు ఏమి చేసినారో నువ్వూ అదే చేస్తావు. ఈ సీమనీల్లకు నీల్లొదిలేస్తావు.

"లేదు, నేను మంచోన్నైపోయినా. దానికే నీ బండకాడ నిజం చెప్పేదానికి వచ్చినా" అంటావా? ఆ మాట ఎవరైనా నమ్ముతారుగానీ నేను మాత్రం నమ్మేది లేదు. దేనికంటే మొన్న నువ్వు తిరప్తిలో ఇల్లు కట్టిపిచ్చేదానికి బోరు

ఏపిచ్చినావు. ఆరునూర్ల అడుగులకే నీల్లు పడినాయి. అయినా తొమ్మిది నూర్ల అడుగులు తోలిపిచ్చినావు. దేనికి? రేపు అక్కాపక్కా ఉండే సన్నాపన్నా జనాలు బోర్లేసినా నీ బోరు ఎండిపోకుండా ఉండేదానికి. నువ్వు, నీ పిల్లకాయలు సల్లంగుండాల. దానికోసం జనాలు ఎండిపోవాల. ఆ జనాలు ఊర్లో బతికేదానికి లేకుండా వలసలు పోయేట్టుగా చేసిందేదీ నువ్వే–ఎన్నికలు వస్తాన్నిట్లే వాండ్లను కార్లలో పిలవనంపేదీ నువ్వే! పంగమాలిన మంచి మాటలు చెప్పేదీ నువ్వే–ఆ మంచి ఎగబడకుండా దొంగలతోలేదీ నువ్వే! ఎగేస్తానని చెప్పేదీ నువ్వే–ఎగబడేవాండ్లను దిగదోసేదీ నువ్వే! న్యాయాలన్నీ చదివిండేదీ నువ్వే–ఆ న్యాయానికి అన్యాయం చేస్తాండేదీ నువ్వే! నీయట్లా మోసగాండ్లు రాజులైతే రామరాజ్యం ఎట్లాగొస్తాది?" అంటా అడుగుతాండంగానే..,

జనాల్లోనింటీ ఎవుడో బత్తుడు అడ్డంపట్టి"జై శ్రీరామ్" అంటా మోడాలు ఇరిగిపడేంత గట్టిగా అరిచినాడు.

ఆపాట్నే అంజన్నసామి పెద్దప్పమాట పెద్దప్పకు ఇడిచిపెట్టి "సీరామ జైరామ సీతారామా" అంటా పాటెత్తుకున్నాడు. ఆ సామికిగానీ రాముని పేరు ఇనపడిచ్చిందంటే ఇంక దేనిమిందా గమనం ఉండదనేమాట కాలానికి బాగా తెలుసు. దానికే అంజన్నసామి సెలవు కోరకుండానే ముందుకు ఎలబారింది పెద్దప్ప కాలం.

నేను ఆగమని అరుస్తానే ఉండా. ఐనా ఆగలా.

తలకూడా ఎనక్కు మళ్ళించి సూడకుండా దానిపాటికి అది పోతానే ఉంది.

అంతేలే..,

అది ముందుకు పోతానే ఉండాల.

అది ముందుకు పోతాండేది గమనిస్తాన్నిట్టే పెద్దప్ప నా గొంతు అదంబట్టినాడు.

"ఆ మర్డర్ చేపిచ్చిండేది నేను కాదు"అంటా గట్టిగా అరిచినాడు.

ఎర్రిజనాలు అదే నిజిమని నమ్మేసినారు.

నేను..,

ఆచారప్పలో ఉండంగా మొత్తం లోకానికే ఇనపడిచ్చినా.

జవానులో ఉండంగా ఈ బండకాడుండే జనాలకు కనపడిచ్చినా.

ఇబ్బుడు ఇనపడిచ్చేదీ లేదు. కనపడిచ్చేదీ లేదు.

ఐతే ఏమంట?

నిజం పెద్దప్పను నేనే!

పూజారప్ప చెప్పిండే ఆత్మ సాక్షిని నేనే!!

ఈ రాల్లసీమకు నిజం సాక్షిని నేనే! నేనే! నేనే!

COMMENTS